ప్రజాశక్తి
శుక్రవారం 6 సెప్టెంబర్ 2024
5
అనంతపురం

రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

క్రికెట్ సంబరం ఆరంభం

మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రికెట్ అభిమానులు

◆ మొదటి రోజు బౌలర్లదే హవా
◆ అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ షో

◆ వీక్షకులపై 'ధరాభారం'
◆ పాస్‌ల జారీపై సీనియర్లలో అసంతృప్తి
◆ రెండేళ్ల పిల్లలకు పాస్ ఉండాల్సిందే..!

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

దులీప్ టోర్నీ సంబరం ఆరంభమైంది. అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సు క్రికెట్ గ్రౌండ్‌లో సి, డి టీమ్‌ల మధ్య మ్యాచ్ గురువారం ప్రారంభమైంది. సి టీమ్ టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదటి రోజు మ్యాచ్‌లో బౌలర్ల హవా కొనసాగింది. ఒక్క రోజు వ్యవధిలోనే 14 వికెట్లు పడ్డాయి. టాస్ ఓడి మొదట బ్యాటింగుకు దిగిన డీ టీమ్ ఆరంభం నుంచి వికెట్లు పడుతూ వచ్చాయి. ఏడవ ఆటగాడిగా బరిలోకి దిగిన అక్షర పటేల్ 86 పరుగులు చేయడంతో 164 పరుగులకు అలౌట్ అయ్యింది. శ్రేయస్ అయ్యర్ 9 పరుగులకే అవుట్ అయ్యి నిరాశ పరిచాడు. డి టీమ్‌లో విజయ్ కుమార్ వైశాక్ మూడు వికెట్లు, అన్సులన్ కాంబోజన్ 2, హిమాన్సు చౌహాన్ 2, మనవ సుతార్, హృతిక్ షోకీన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సి జట్టు కూడా ఎదురీదుతోంది. 33 ఓవర్లలో 91 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. హర్షిత్ రాణా, అక్షర పటేల్ చెరో రెండు వికెట్లు పడ్డాయి.

అక్షర్ మెరుపు ఇన్నింగ్స్

7వ నెంబర్ ఆటగాడిగా బరిలో దిగిన అక్షర్ పటేల్ మెరపు ఇన్సింగ్స్ ఆడాడు. మొదట్లో నెమ్మదిగా ఆడుతూ ఆ తర్వాత వేగం పెంచాడు. అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీ, సిక్సర్‌గా మలిచాడు. లాంగ్ ఆఫ్ మీదుగా కొట్టిన ఓ సిక్సర్ స్టేడియం బయట పడింది. 118 బంతులు ఎదుర్కొని 6 ఫోర్లు, 6 సిక్సర్ల సహాయంతో 86 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతనికి తోడుగా అర్షదీప్ సింగ్ 13 పరుగులు చేశాడు. అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ 9వ వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

పాస్‌ల జారీపై సీనియర్లలో అసంతృప్తి

మ్యాచ్‌ను చూసేందుకు ప్రేక్షకులకు అనుమతికోసం ఉచితంగా పాసులు మంజూరు చేశారు. ఈ పాసులు విషయంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుల్లోనే అసంతృప్తి నెలకొంది. వారికి కూడా పాసులు ఇవ్వకుండా కొద్ది మందికి మాత్రమే వీటిని ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అంటీముట్టనట్టుగా వ్యవహరించడం గమనార్హం. అదే విధంగా మీడియాకు జారీ చేసిన బిసిసిఐ పాసుల్లో కూడా తప్పిదాలు దొర్లాయి. ఇప్పటికీ కొద్ది మంది మీడియా ప్రతినిధులకు పాసులు జారీ అవలేదు. రెండేళ్ల పిల్లాడికి కూడా పాస్ ఉండాలని చెప్పడంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారు. మ్యాచ్ చూడాలని చిన్న పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు రెండేళ్ల పిల్లాడికి కూడా పాస్ ఉండాలని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై పిఆర్‌ఒ రాజగోపాల్‌ను అడుగగా వేల పాసులు మంజూరు చేసే సమయంలో తప్పిదాలు జరుగుతుంటాయంటూ చాలా తేలిగ్గా చెప్పడం గమనార్హం.

వీక్షకులపై ధరాభారం

దులీప్ ట్రోఫి టోర్నీ చూసేందుకు ఉచితంగా పాసులను నిర్వాహకులు పంపిణీ చేశారు. ఇవి అందుకున్న అభిమానులు పెద్దఎత్తున మైదానంకు విచ్చేశారు. ప్రధానంగా యువత, చిన్నారులు అధికంగా వచ్చారు. ఉదయం 10.30 గంటల తరువాత ప్రధాన గేటుకు తాళాలు వేశారు. మ్యాచ్ చూసే సమయంలో తినుబండారులు ఏమైనా తినాలంటే మాత్రం ధరలు ఆకాశాన్ని అంటే విధంగా ఉన్నాయని అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు రూపాయలు విలువ చేసే సమోస రూ.10లకు అమ్మగా, పది రూపాయల ఐస్ క్రీమ్ రూ.50, శీలపానీయాలు రూ.50గా, వేరుశనగ పప్పులు రూ.20, చిన్నపాటి బిస్కెట్ ప్యాకెట్ రూ.20, పిల్లలు ఊపే బూర రూ.50 భోజనం తదితర అన్నింటిపైనా రెండు, మూడు రెట్లు అధిక ధరలు వసూలు చేశారు. స్టేడియం వద్ద అన్ని రకాల తిండిపదార్థాల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఏమైనా తినాలన్న వీక్షకుడు ఆలోచించుకునే పరిస్థితి నెలకొంది.

మార్గ నిర్దేశకులు గురువులు

గురుపూజోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో ప్రతి ఒక్కరినీ తీర్చిదిద్దే మార్గ నిర్ధేకులు ఉపాధ్యాయులని ప్రజాప్రతినిధులు, అధికారులు కొనియాడారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో గురువారం నాడు గురు పూజోత్సవం – 2024, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానానికి తీసుకువచ్చేలా ఉపాధ్యాయులు ఉత్తమ సేవలను అందిస్తున్నారని, వారిని సన్మానించడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ఎంత మార్పు వచ్చినా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, అదంతా ఉపాధ్యాయులు నేర్పిన పాఠాల వల్లనే అన్నారు. ఉపాధ్యాయులు లేనిదే ఈ సమాజం లేదన్నారు. గతంలో ఉన్న ప్రజా వ్యతిరేక పాలన పోవడానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంలో కీలక పాత్ర పోషించింది ఉపాధ్యాయులేనని అన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. జెడ్పీ ఛైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ "జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు.. సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు.." గురువు అని కొనియాడారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ గురువు లేకపోతే ప్రపంచమే లేదన్నారు. ఉపాధ్యాయులంతా ఎంతో చిత్తశుద్ధితో పనిచేయాలని, విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన చేయాలని సూచించారు. అనంతరం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఈవో వరలక్ష్మి, డివైఇఒ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఎపిసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బిఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ కౌసిక్‌కు జ్ఞాపికను అందిస్తున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు

భారతీయ ప్రమాణాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని మాసినేని హోటల్‌లో బిఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) భారతీయ ప్రమాణాలు సంస్థ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల కార్యకర్తలకు అవగాహన చైతన్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. బిఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ కౌసిక్ మాట్లాడుతూ భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా పారిశ్రామిక ఉత్పత్తులు ఉండాలని, మోసపూరితంగా పర్యవరణంకు హాని కలిగించేవిగా ఉండకూడదన్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులపైన ఖచ్చితంగా ఐఎస్ఐ మార్క్ కలిగి ఉండాలన్నారు. బంగారు నగలపై హాల్మార్క్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ సాయి కౌసిక్, ప్రామాణిక ప్రమోషన్ అధికారి కృష్ణవీర్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు మోహన్, అసదుల్లా, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, దేవేందర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గం సిడిపిఒగా పద్మావతి బాధ్యతల స్వీకరణ

సిడిపిఒ పద్మావతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒగా ఎ.ఎల్.పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆమె బదిలీపై గుడిబండ ప్రాజెక్ట్ నుంచి రాయదుర్గం వచ్చారు. ఆమె 1993లో రాయదుర్గం మండలంలోని ఆయుతపల్లి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో చేరారు. 1997లో గ్రేడ్–2 సూపర్వైజర్‌గా, 2008లో గ్రేడ్–1 సూపర్వైజర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. గతేడాది మార్చిలో గుడిబండ ప్రాజెక్టులో సిడిపిఒ పని చేశారు.

విరాళాల సేకరణ

కళ్యాణదుర్గం : వరద బాధితుల కోసం స్థానిక ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండో రోజూ విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగానే గురువారం డీఎస్పీ రవిబాబు, సిఐ వెంకటరమణ విరాళాల సేకరణను ప్రారంభించారు. పట్టణంలోని విద్యుత్, మండల పరిషత్, వ్యవసాయ, ఉద్యాన, తదితర శాఖల కార్యాలయాల్లో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోణంకి శ్రీధర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రజా సేవకుల్లా పని చేయండి : ఎంపిడిఒ

కుందుర్పి : ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజా సేవకులుగా పని చేయాలని ఎంపిడిఒ లక్ష్మినరసింహ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నూతన ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకూ సలహాలు, సూచనలు ఇస్తూ సకాలంలోనే పనులు పూర్తి చతేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి పేరు తీసుకురావాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేసినా బాధ్యులను తక్షణమే తొలగిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై జిల్లాలోనే ఉపాధి హామీలో మండలాన్ని మొదటి స్థానంలో నిలిపేలా ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ ఓబిరెడ్డి, నూతన ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కార్మికుల నిరవధిక సమ్మె

ఉధృతమైన నిరసనలు-పలుసంఘాల మద్దతు..ర్యాలీలు

ప్రజాశక్తి-గుత్తి

సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు ఉధృతం అయ్యాయి. కార్మికుల నిరసనలను పలు సంఘాలు, నాయకులు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం గుత్తిలో సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ కూడలి మీదుగా రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకూ సాగింది. అక్కడ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి అందజేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, ఐఎఫ్‌టియు నాయకుడు బాషా మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి పథకంలో జిల్లావ్యాప్తంగా 532 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారందరికీ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు రాకపోవడంతో కుటుంబాలు ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. ప్రభుత్వం సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు కృష్ణమాచారి, జోసఫ్, నాగభూషణం, నాగరాజు, ఎం.రామాంజనేయులు, వి.శ్రీనివాసులు, గిరిబాబు, శివప్రసాద్, రంగా, రాజు, చంద్ర, దేవా, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ర్యాలీ చేస్తున్న తాగునీటి సరఫరా కార్మికులు, కార్మికసంఘం నాయకులు

నార్పల : తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బి.పప్పూరు పంప్‌హౌస్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల సమ్మెతో 1300 గ్రామాల ప్రజలకు తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం రాలేదన్నారు. అత్యవసర సేవల్లో శాశ్వత ఉద్యోగులు పని చేయాల్సిన చోట.. కాంట్రాక్టు కార్మికులను నియమించి ప్రజలకు తాగునీటి సరఫరా చేయకుండా ప్రభుత్వం తప్పుకుంటోందని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి పథకంలో పని చేసే వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 15రోజులుగా కార్మికులు రోడ్డున పడినా తక్షణ పరిష్కారం చూపకుండా సమ్మె విరమించాలని కోరడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. వెంటనే ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, చంద్రమోహన్, నరసింహులు, ధనుంజయ, నాగభూషణం, ఈశ్వరయ్య, శివశంకర్, అంకన్న, శరత్‌బాబు, నాగరాజు, పుల్లానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం కార్మికుల సమ్మెకు రైతుసంఘం మద్దతు

అనంతపురం కలెక్టరేట్ : బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఎపి రైతుసంఘం సంపూర్ణ మద్దతు ఇస్తోందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏళ్ల తరబడి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు కనీసం నెలనెలా వేతనాలు చెల్లించకపోతే ఎలా జీవించాలని ప్రశ్నించారు. వేతనాలతోఆపటు ఇఎస్ఐపిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికనా ప్రభుత్వం స్పందించి కార్మికుల బకాయిలు చెల్లించి సమ్మెను విరమింపజేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాయలప్పదొడ్డిలో విషాదం

నీటికుంటలో పడి విద్యార్థి మృతి - పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మృతి చెందిన విద్యార్థి మణికంఠ

మండల పరిధిలోని రాయలప్ప దొడ్డి గ్రామంలో విషాధ ఘటన చోటు చేసుకుంది. పాఠశాలకు వెళ్లిన ఓ విద్యార్థి మధ్యాహ్న సమయంలో ఓ తోటలోని నీటికుంట వద్దకు బహిర్భూమికి వెళ్లి అందులో పడ్డాడు. ఈ ఘటనతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. తమ కుమారుని మృతికి ఉపాధ్యాయులే కారణం అంటూ పాఠశాల ఎదుట తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రాయలప్ప దొడ్డి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, త్రివేణి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు మణికంఠ(13) రాయలప్పదొడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని ఉపాధ్యాయులను అడగకుండా పాఠశాల నుంచి బయటకు వచ్చేశాడు. నేరుగా గ్రామ సమీపంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో నీటి కుంట వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీటిలో కాలు జారిపడి ఊపిరాడక మృతి చెందారు. అక్కడ ఉన్న పశువుల కాపరులు గుర్తించి ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకుని బాలుని మృతదేహాన్ని బయటకు తీశారు.

తల్లిదండ్రుల ఆందోళన

తమ కుమారుని మృతికి ఉపాధ్యాయులే కారణం అంటూ తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థిని రక్షణను పట్టించుకోకుండా బయటకు పంపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డివైఈవో శ్రీనివాస్, ఎంఇఒ ఓబుళపతి, తహశీల్దార్ సుమతి, ఎస్ఐ పరశు రాముడు తదితరులు పాఠశాల వద్దకెళ్లి విచారణ చేపట్టారు. సంఘటన ఎలా జరిగిందన్న దానిపై పూర్తి వివరాలను డివైఇఒ ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో విచారణ చేపట్టారు. విచారణ చేపట్టి పూర్తి వివరాలు బహిర్గతం చేస్తామని డివైఇఒ విలేకరులకు తెలిపారు.

కళ్యాణదుర్గం సిఐగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం : పట్టణ సిఐగా వి.వెంకటరమణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకూ ఇక్కడ పని చేస్తున్న సిఐ హరినాథ్ విఆర్‌కు బదిలీ అయ్యారు. విఆర్‌లో ఉన్న వెంకటరమణ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

వెంకటరమణ

అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాయదుర్గం

స్థానిక ఆర్టీసీ డిపోలో తొలగించిన అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తొలగించిన కార్మికులతో కలిసి ఆర్టీసీ డిపో ముందు అరగంట పాటు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్ నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల దాదాపు 14 మంది కార్మికులను విధుల నుంచి తొలగించి 6 నెలలు కావస్తోందని, వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మేనేజర్‌ను పలుమార్లు కలిసినా ఫలితం లేదని మండిపడ్డారు. ఉన్నతాధికారులు తక్షణమే మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని, 14 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు రామాంజనేయులు, ముఖేష్, నవీన్, సవరప్ప, కుసుభ, నూర్ మహమ్మద్, హనుమంతు, నరేష్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రాయదుర్గం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని 'స్వచ్ఛ రాయదుర్గం– స్వస్థ రాయదుర్గం' బృందం పేర్కొంది. పట్టణంలోని వాల్మీకి నగర్‌లో గురువారం ప్రజలకు అంటు వ్యాధులు, దోమల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకునేందుకు ప్రజలు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, ఆరోగ్య విద్య బోధకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య పర్యవేక్షకులు శాంతకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం.. చదవనిద్దాం..

సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రస్తుత సమాజంలో బాలికలకు రక్షణ కరువైన నేపథ్యంలో వారిని రక్షిద్దాం.. చదువనిద్దాం.. అని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న, ఆర్టీసీ టీం లీడర్ ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక కెజిబివిలో ప్రిన్సిపల్ మహాలక్ష్మి అధ్యక్షతన ఆర్‌డిటి, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'బాలికలను రక్షిద్దాం–బాలికలను చదవనిద్దాం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న హాజరై మాట్లాడారు. బాలికల చదువు, పౌష్టికాహారం, బాల్య వివాహాలపై వివరించారు. ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణపై పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ కాశింబి, ఉపాధ్యాయులు ఇందిర, మెహతాజ్, వనమాల, గీతాంజలి, జ్యోతి, కురేశాబి, నసీమ, ప్రమీల, శాంతి, విజయలక్ష్మి, జ్యోతి, అలివేలమ్మ, వైద్య సిబ్బంది నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఆడ కూతుర్ని రక్షిద్దాం.. చదివిద్దాం.. ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కెజిబివి జూనియర్ కళాశాలలో 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. ఆరోగ్య విద్య బోధకులు డాక్టర్ కెంచె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కడుపులో శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమన్నారు. అలాంటివి జరిపితే స్కానింగ్ జరిపిన వైద్యులతో పాటు చేయించుకున్న తల్లిదండ్రులు, ప్రోత్సహించిన వారికి జరిమానాతో పాటు జైలు తప్పదన్నారు. బాలిక విద్య ద్వారా ఆర్థిక, రాజకీయ సాధికారత సాధ్యమవుతుందని, మహిళలపై అఘాయిత్యాలను నివారించడం సాధ్యమన్నారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు శాంతికుమారి, లక్ష్మి, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకులతో ఇన్‌చార్జి విసి సుదర్శనరావు

సమసమాజ స్థాపనలో అధ్యాపకుల పాత్ర కీలకం

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శన్ రావు

ప్రజాశక్తి -అనంతపురం

భావితరాన్ని తీర్చిదిద్ది సమ సమాజ స్థాపనలో అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం అని అనంతపురం జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్. సుదర్శన రావు తెలియజేశారు. గురువారం సాయంత్రం జెఎన్‌టియు పరిపాలన భవనం ఆర్యభట్ట ఆడిటోరియంలో 2024 వర్సిటీ స్థాయి ఉత్తమ అధ్యాపకుల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్‌వి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి విసితో పాటు ఓఎస్‌డి ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు పొందిన అధ్యాపకులు మరింత బాధ్యతగా విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ సిఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయుని పాత్ర కచ్చితంగా ఉంటుందన్నారు. అనంతరం అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నా రెడ్డితో పాటు యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల విభాగాల ఆధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతమైన సమాజం కోసం పనిచేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

విజ్ఞానవంతమైన సమాజం కోసం ఉపాధ్యాయులు పని చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని 74–ఉడేగోళం టెక్స్‌టైల్ పార్కు ప్రాంగణంలో ఎమ్మెల్యే చేయూతతో నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మెరుగైన విజ్ఞానం అందించేందుకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. పలువురు సీనియర్ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సత్కరిం చారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటరమేష్, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు టంకశాల హనుమంతు, వీరేష్, మంజుస్వామి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఆదర్శప్రాయమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన అరుదైన ఘనత సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు మాత్రమే దక్కిందన్నారు. అలాంటి ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి భార్గవ బాలభారతి, సిబ్బంది ఇంటియాజ్ అహ్మద్‌బాషా, కిరణ్, రామాంజినమ్మ, వెంకటేష్, హేమమాలిని, శ్రీవిజయ, కావేరి, సరస్వతి, ఉజ్జినేశ్వరి, బాలచంద్ర, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఏపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పెన్షనర్ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 80ఏళ్లు దాటిన విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.ఆబూబకర్, కార్యదర్శి కె.రామ్మోహన్, ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు శామ్యూల్, వెంకటేష్ ఎస్ బి ఐ క్షేత్రాధికారి నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మహత్మ జూనియర్ కళాశాలలో కరెస్పాండెంట్ ధనుంజయరెడ్డి, ప్రిన్సిపల్ లతాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది.

పుట్లూరు : మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ, ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటి సభ్యులు సూర్యనారాయణ, వైస్‌ఛైర్మన్ సూరి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర బాలికల పాఠశాల, కసూరిబా గాంధీ పాఠశాలతోపాటు మిత్ర ఎల్‌ఎస్‌ఆర్‌డబ్ల్యు సరస్వతీ విద్యామందిరం, పూజిత శిరిడీసాయి విద్యాలయాల్లో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, నాగేష్, రాధా, నిర్మల వెంకటరెడ్డి, ఓబిరెడ్డి, జయరామిరెడ్డి, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు శశికళ, లక్ష్మీదేవి, రమాదేవి, ఆనంద్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని కెజిబివి, చిలమకూరు ఆదర్శ పాఠశాల, పాతపేట శివారులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులోభాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు గిరిధర్‌రెడ్డి, వెంకటరమణ, విశ్వనాథ్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల వ్యాప్తంగా ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన వేడుకలను సిఐ సంతోష్‌రెడ్డి ప్రారంభించారు. .

ఉరవకొండ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మమత అధ్యక్షత రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా అధ్యాపకులు ప్రిన్సిపాల్ మమతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఖాదర్, శివప్రసాద్, సీనియర్ వృత్తి విద్య అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, బాషా, మధు, లక్ష్మీనారాయణరెడ్డి, అనితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని హంపాపురంలో ఉన్న ఎన్‌ఎస్‌బిటి కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండి వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్, ఏఓ విటి రెడ్డి పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న శ్రీచైతన్య బాలిక రెసిడెన్షియల్ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏజిఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 'విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ' అన్న అంశం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం ఆహూతులను కట్టిపడేసింది. తర్వాత వివిధ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాభాను, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

బెలుగుప్ప : ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మహనీయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మారెన్న కొనియాడారు. గురువారం మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నాగభూషణం, తిప్పేస్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో రాధాకృష్ణకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

కాగా మండల పరిధిలోని నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌బిఐ మేనేజర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉప్పర శ్రీనివాసులు, ఉపాధ్యాయురాలు రేణుకాదేవి, సర్పంచి రామిరెడ్డి, ఉపాధ్యాయులు మహేష్‌బాబు, చెన్న వీరప్ప, స్కూల్ కమిటీ ఛైర్మన్ శేఖర్, గోవింద్‌రెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి జడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్ఎం రోషన్‌బాషా ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయుడు నాగేశ్వర్‌రావుని హెచ్ఎం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ స్కూల్ హెచ్ఎం ప్రసాద్, గంగ రాజు, తెలుగు ఉపాధ్యాయుడు ఆనందరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతు లు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ రాజన్న, ఆనందరెడ్డి, వాణి, ఝాన్సీ, సురేష్, మూర్తి, గౌరి, స్వరూప, తమ్మన్న, జ్యోతి, రాణి, దాక్షాయని, రాజు, వెంకటేష్, వన్నూరు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ వీరన్న మాట్లాడుతూ సర్వేపల్లి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యావంతులు పాల్గొన్నారు.

రాయదుర్గం : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన 15 మంది ఉపాధ్యాయులను క్లబ్ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకట రమేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంబాజీరావు, కార్యదర్శి అశోక్‌కుమార్, శ్రీనివాసులు, శంకర్‌బాబు, ధనార్జన, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో

అనంతపురం : శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ యామిని , ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డా॥లక్ష్మి నారాయణ అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సతీష్ కుమార్ యాదవ్, కరస్పాండెంట్ కుర్లి రేవంత్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఆశా'లకు పెంచిన వేతనాలు చెల్లించాలి : సిఐటియు

డాక్టర్ బాలాజీకి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు

గుమ్మఘట్ట : ఆశా వర్కర్లకు పెంచిన వేతనాల జీవోను వెంటనే విడుదల చేసి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బాలాజీనాయక్‌కు ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 9న అప్పటి ప్రభుత్వం ఆశావర్కర్ల యూనియన్‌తో జరిపిన చర్చల్లో భాగంగా కుదిరిన ఒప్పంద జీవో పత్రాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశావర్కర్లకు పనిభారం తగ్గించాలని, ఒప్పంద జీతాలు విడుదల చేయాలి, 60ఏళ్లు నిండిన ఆశాకార్యకర్తల రిటర్మెంట్‌ను జీవోలు విడుదలయ్యే వరకూ ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీల్డ్‌వర్క్, సెంటర్ వర్క్‌లో పనిచేయని సెల్‌ఫోన్లతో మెజారిటీ ఆశావర్కర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో ముందస్తు 'చవితి' వేడుకలు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు

అనంతపురం : నగరంలోని సంఘమేష్ నగర్, గుత్తి రోడ్డులో ఉన్న మాంటిస్సోరీ విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరెస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి హితమే పండుగల పరమార్థం అన్నారు. సంప్రదాయాల పరిరక్షణతోపాటు సామాజిక బాధ్యతగా మట్టి వినాయకులనే పూజించాలని పిలుపునిచ్చారు. రసాయనాలతో కూడిన విగ్రహాలను వాడొద్దని సూచించారు. అనంతరం ర్యాలీగా టవర్‌క్లాక్ చేరుకుని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు ఎ.రమాదేవి, కె.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఔదార్యం

ఎమ్మెల్యేను అభినందిస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వరద బాధితులపై ఔదార్యం చూపారు. విజయవాడలో జలవిలయంలో చిక్కుకుని ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న బాధితుల సహాయార్థం తన నెల వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా వరద బాధితులకు విరాళాలను అందజేశారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి పోరాడాలి

జగన్‌కుబొకే అందజేస్తున్న రవీంద్రారెడ్డి

అనంతపురం : పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా క్రియాశీలకంగా వ్యవహరించాలని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన వెన్నపూస రవీంద్రారెడ్డి గురువారం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్య సాధనకు పార్టీతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

'ట్రెల్లిస్' విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం : ఓ న్యూస్ టీవీలో ప్రసారమైన వివిధ కార్యక్రమాల్లో నగరంలోని ట్రెల్లిస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విద్యార్థుల సంక్షేమ కోసం రూ.లక్షను విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రెల్లిస్ పాఠశాల ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల, డైరెక్టర్ అనిల్ తేజ, కోశాధికారి నందిని, మేనేజ్‌మెంట్ సభ్యులు అమిత ప్రియ, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయక చర్యల్లో 'వైకుంఠం'

అనంతపురం కలెక్టరేట్ : విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి గురువారం పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఆహార పదార్థాలు, మెడికల్ కిట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలతో విజయవాడ అతలాకుతలం అయిందన్నారు. వదర బాధితులందరినీ ఆదుకోవడమే టిడిపి ప్రభుత్వ లక్షమన్నారు.

బ్యుటీషియన్, టైలరింగ్ కోర్సులు ప్రారంభం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెర్నేపల్లి అంగన్వాడీ కేంద్రంలో నిరుద్యోగ మహిళలకు ఏర్పాటు చేసిన బ్యుటీషియన్, టైలరింగ్ కోర్సుల శిక్షణ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ ఢిల్లేశ్వరి, జనశిక్షణ సంస్థాన్ కోఆర్డినేటర్ రషీద్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు నారాయణ గురువారం ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. తర్వాత గర్భిణులకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున గుమ్మనూరు నారాయణ ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు జయలలిత, సుజాత, సరోజమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

గుత్తి : వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సిఐ బి.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని విరుపాక్ష కన్వర్షన్ హాల్‌లో శ్రీ గౌతమపురి నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వినాయక చవితిని పురస్కరించుకొని మండపల్లో మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఓబులేసు, ఈఓఆర్ డి శివాజిరెడ్డి, సచివాలయ అధికారి ఇమామ్ హుస్సేన్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇసిసి డే

అనంతపురంరూరల్ : అనంతపురం రూరల్-5 సెక్టార్ పరిధిలోని ఎ.నారాయణపురం-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఈసీసీ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మన్న, ఏఎన్ఎం మీనాక్షి, అంగన్వాడీ కార్యకర్తలు కౌసర్‌భాను, లావణ్య, ముంతాజ్, రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కళ్యాణదుర్గం : రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని దేవినేని ధర్మతేజ, మోరేపల్లి మల్లికార్జున తెలిపార. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ట్రై ల్యాండ్ హార్టికల్చర్ రైతులకు 6వేల మామిడి మొక్కలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సహకారంతో అర్హులైన రైతులను పండ్ల తోటల పెంపకం వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సోలోమాన్, గొల్ల వెంకటేశులు, అనిల్‌చౌదరి, శర్మాస్, కొల్లాపూర్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఎపిఎంఐపి పిడి రఘునాథ్‌రెడ్డి సూచించారు. పండ్ల తోటల విస్తరణ పథకం కింద మండలంలోని ఆవులదట్ల, బిఎన్. హళ్లి, వద్రహొన్నూరు, నేత్రపల్లిలో సాగు చేసిన చీని, దానిమ్మ పంటలను గురువారం ఆయన జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావుతో కలిసి పరిశీలించారు.

ప్రణాళిక ప్రకారమే ఎరువులు సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

జిల్లాకు కేటాయించిన ఎరువుల ప్రణాళికకు అనుగుణంగా ఆయా కంపెనీలు ఎరువులు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎరువుల కంపెనీ అధికారులు, ఎపి మార్క్‌ఫెడ్, రేక్ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్-2024కి సంభందించి జిల్లాకు అన్నిరకాల ఎరువులు 111854 మెట్రిక్ టన్నులు కేటాయించగా ఇప్పటి వరకూ 124865 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన ఎరువులను కూడా త్వరగా సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, సాంకేతక వ్యవసాయ అధికారి బాలునాయక్, ఆర్‌సిఎఫ్, ఎంఎఫ్ఎల్, ఐపిఎల్, మహాధన్, కోరమాండల్, ఇఫ్కో, క్రిబ్ కో, స్పిక్ సేల్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం 2,228 మంది రిజిస్ట్రేషన్

ప్రత్యామ్నాయ సాగు కోసం అవసరమైన విత్తనం కోసం 2228 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అవసరమైన 711 క్వింటాళ్ల విత్తనాలను పొజిషన్ చేసినట్లు ఆమె తెలిపారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం : ఎంపిడిఒ

పుట్లూరు : వచ్చేనెల 2వతేదీ నాటికి మండలంలో చెత్త లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. దోమలు అభివృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి గ్రామస్తుల నీటి తొట్లను శుభ్రం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రామలింగారెడ్డి, హౌసింగ్ ఎఇ లోకేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ఉరవకొండ : 'మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలతోపాటు మొక్కలను పంపిణీ చేయనున్నట్లు జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.పవన్‌కుమార్, టి.సుమలత దంపతులు శుక్రవారం ఉదయం 10-30 నుంచి 6 గంట వరకూ పట్టణంలోని ఫైర్ ఆఫీస్‌కు ఎదురుగా ఉన్న జైకిసాన్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

ఉరవకొండ : విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పౌష్టికాహారంపై దృష్టి సారించేలా చూడాలని రాకెట్ల పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఆమిద్యాల అంగన్వాడీ కేంద్రం-2లో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకగుణాలను తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, రాకెట్ల పిహెచ్‌సి సిబ్బంది, ఆమిద్యాల అంగన్వాడీ కేంద్రం-2 కార్యకర్త నాగవేణి, ఎఎన్ఎం చాముండి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కడప

I.A.No. 66/2023 in
M.V.O.P.No. 493/2016

కె.వకులాదేవి, W/o రాఘవేంద్ర ప్రసాద్.
...పిటీషనర్

Vs

1. వడ్డె శివశంకర్, S/o నడిపెన్న, డోర్‌నెం.3/1076-1, టైలర్స్ కాలని, తాడిపత్రి, అనంతపురం జిల్లా.
2. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ లిమిటెడ్ కంపెనీ, డివిజనల్ మేనేజరు, దోబీ ఘాట్ రోడ్డు, కడప జిల్లా.
3. నూతన పాటి ఆనంద్, S/o క్రిష్టప్ప లారి డ్రైవరు, డోర్ నెం.3-47, పి.కొత్తపల్లె గ్రామం, పెద్దపప్పూరు మండలం, అనంతపురం జిల్లా.

...రెస్పాండెంట్స్

పై దావా యందలి వాది 8.12.2014 నాడు జరిగిన రోడ్డు ప్రమాద నిమిత్తము నష్టపరిహార దావా దాఖలు చేసియున్నారు. సదరు లారీ డ్రైవరు మరియు 3వ ప్రతివాది అయిన నీకు పలుమార్లు నోటీసులు పంపిననూ నీవు గైకొనక పోయినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా 3వ ప్రతివాదికి నోటీసు ప్రకటించడమైనది. కావున తేది :12.9.2024 నాడు నీవు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని రాజశ్రీ కోర్టు యందు ఉ:10.30 ని॥లకు హాజరుగా వచ్చి ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల నీకు పరోక్షముగా కోర్టు తీర్మాణము జరుగునని తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఆదేశము//

ఎమ్.రామక్రిష్ణ, M.A.,B.L.,
అడ్వకేటు, కడప.
సెల్: 95507 58486.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-శింగనమల

సోదనపల్లి ఉపాధ్యాయులు ఆర్.వివేకానందను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ, ఉన్నతాధికారులు

మండల పరిధిలోని సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆర్.వివేకానందను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఈమేరకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్, డిఇఒ వరలక్ష్మి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.వివేకానంద మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాగా అవార్డు అందుకున్న వివేకానందను తోటి ఉపాధ్యాయులు, మండల వాసులు అభినందించారు.

పామిడి : పామిడిలోని తలవాల కట్ట దగ్గర ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తున్న నీలం ప్రిస్కిల్లాకు ఉత్తమ అవార్డు వరించింది. ఈమేరకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో అవార్డు అందుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని 1వవార్డు స్కూల్ ఉపాధ్యాయులు రంగనాథ్, ఎన్ఆర్.కాలనీ ఉపాధ్యాయురాలు రాణీసంయుక్త, రామగిరి యుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయులు రఫీ ఉద్దీన్ ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఇఒలు జయానాయక్, సత్యనారాయణ, మండల ఎస్‌టీయూ, యూటీఎఫ్ శాఖ నేతలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నియోజక వర్గంలో నెలకొన్న తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఈమేరకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు మంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడుతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించారు. 'హెచ్చెల్సీ నీటి కోసం రైతుల ఎదురుచూపు' అని గురువారం ప్రజాశక్తి వెబ్‌లో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సాగు, తాగునీటితోపాటు హెచ్చెల్సీకి సాధ్యమైనంత త్వరలో నీటిని విడుదల చేయాలని కలెక్టర్‌ను కలిసి కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సాగు, తాగు నీరు సమస్యలు లేకుండా చూడటమే తన లక్ష్యమన్నారు. హెచ్ఎల్‌సికి నీరు విడుదల చేస్తే నియోజకవర్గంలోని చెరువులకు నీటిని నింపే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పోతుందన్నారు. అంతేగాకుండా నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమను నివారిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-శింగనమల

రైతులు మెళకువలు పాటిస్తే వరి పంటలో వచ్చే సుడిదోమను నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చనిజిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం మండల పరిధిలోని తరిమెల రైతు సేవాకేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో గ్రామ విత్తనోత్పత్తి పథకం కింద తరిమెలలో 75 క్వింటాళ్లు, కల్లుమడిలో 37.5 క్వింటాళ్ల వరి బిపిటి-5204 మూలవిత్తనం రాయితీపై ఇచ్చామన్నారు. వరి సాగు చేసిన రైతులు క్లోరిపైరిఫాస్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ శైలజ, ఎఒలు అన్వేష్‌కుమార్, శ్రీనివాస్, శంకర్ లాల్‌నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ఉరవకొండ : గ్రామస్థాయి వ్యవసాయ, హార్టికల్చర్, సిరికల్చర్ అధికారులకు పంటకోత ప్రయోగాలపై గురువారం విడపనకల్లు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం శిక్షణణిచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, సహాయ గణాంక అధికారి పర్వతప్ప మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మిరప, కంది, పత్తి, ఆముదం, వేరుశెనగ, తదితర పంటల్లో పంటకోత ప్రయోగాలు చేయాలన్నారు. పంటకోత ప్రయోగాలు చేసే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ మండల అధికారి నెట్టికంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

శింగనమల : మండల పరిధిలోని కల్లుబడి గ్రామంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మార్కెట్లోకి టాటా ఎలక్ట్రికల్ కార్లు

ఆవిష్కరించిన రవాణా శాఖ డిడి వీరరాజు

ప్రజాశక్తి-అనంతపురం

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న రవాణా శాఖ డీడీ వీరరాజు

అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో టాటా మోటార్స్ రూపొందించిన ఎలక్ట్రిక్ కార్లను రిత్విక కార్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వీరరాజు గురువారం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా సంస్థ నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ కొత్త ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. టాటా సంస్థ రూపొందించిన టాటా సియుఆర్‌వివి ఇవి, పివి వాహనాలు ఒకసారి ఛార్జ్ చేస్తే 585 కిలోమీటర్ల ప్రయాణం చేయవచ్చన్నారు. ముఖ్యంగా ఇలాంటి ఆధునిక పద్ధతుల ద్వారా రూపొందించిన కార్లు వాడడం వల్ల వాతావరణ కాలుష్యం ఉండదన్నారు. రిత్విక టాటా కార్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ ప్రపూర్ణారెడ్డి మాట్లాడుతూ కేవలం 15 నిమిషాల ఛార్జింగ్‌తో 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్నారు. ఈ కారులో ఆరు ఎయిర్ బ్యాగ్స్ సేఫ్టీ మెజర్సు సుదూర ప్రాంతాలకు ప్రయాణానికి అరువైన సకల సౌకర్యాలు సంస్థ కల్పించిందన్నారు. ఈ కారు మూడు ఫ్యూయల్ వేరియంట్లతో వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. కారు బ్యాటరీకి 8 సంవత్సరాలు వాహనానికి మూడు సంవత్సరాలు వారంటీ ఉందన్నారు. 45 కే డబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ 17.49 లక్షలు గా మరియు 55 కే డబ్ల్యూహెచ్ బ్యాటరీ 19.25 లక్షలు కాను ఉందన్నారు. ప్రారంభ ధర రూ.9,99,990 నుంచి రూ.18,99,990 వరకూ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ సురేష్‌నాయుడు, రిత్విక సేల్స్ మేనేజర్ ఆర్‌వై.స్వామి, టిఎంఎ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.